

తిరుమలలో టీటీడీ ఈవో విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి - తిరుమల: శ్రీవారి దర్శనార్థం తిరుమలకు విచ్చేసే భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు టీటీడీ ఈవో జె. శ్యామలరావు, అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరితో కలిసి శనివారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమలలోని సీఆర్వో కార్యాలయాన్ని ఆధునీకరించేందుకు చేపట్టిన ప్రణాళికలను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. భవిష్యత్తులో యాత్రికుల సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా అధునాతన సౌకర్యాలతో సీఆర్వోను ఆధునీకరించేందుకు ఉన్న అవకాశాలను అధికారులతో ఆరా తీశారు. నూతనంగా నిర్మించిన యాత్రికుల వసతి సముదాయం-5 భవనాన్ని పరిశీలించి వెయిటింగ్ హాళ్లు, శుభ్రత, భద్రత ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. టీటీడీ చీఫ్ ఇంజనీర్ సత్య నారాయణ, ఈఈ వేణు గోపాల్, డీఈ చంద్ర శేఖర్, డిప్యూటీ ఈవోలు భాస్కర్, సోమన్నారాయణ, టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ రాముడు, హెల్త్‌ఆఫీసర్ మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పూర్తి చేసుకున్న కుటుంబ సలహా కేంద్రం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మహిళా పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన కుటుంబ సలహా కేంద్రం ఈనెల 12వ తేదీ శనివారానికి ఏడాది పూర్తి చేసుకుంది. ఒక సంవత్సరంలోనే జిల్లా వ్యాప్తంగా 482 కుటుంబాలలో తలెత్తిన సమస్యలు, విభేదాలను కుటుంబ సలహా కేంద్రం, కౌన్సిలింగ్ ద్వారా పరిష్కరించి, వాటిని మళ్లీ ఐక్యంగా జీవించేందుకు కుటుంబ సలహా కేంద్రం కౌన్సిలింగ్ ఉపయోగపడింది. ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన 52 కుటుంబాలు, విదేశాల నుండి వచ్చిన మూడు కుటుంబాలలో విభేదాలను సైతం పరిష్కరించి, అనుబంధాన్ని పునరుద్ధరించారు.

ఏడాది పూర్తి చేసుకున్న ఫ్యామిలీ కౌన్సిలింగ్

సమాజ శ్రేయస్సు కోసం కుటుంబంలో స్థిరత్వం, మహిళల భద్రతే లక్ష్యంగా గత సంవత్సరం చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు మార్గదర్శకతను, ప్రోత్సాహాన్నీ తోడుగా చేసుకొని చిత్తూరు పట్టణంలోని మహిళా పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సలహా కేంద్రం (ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్)ను గ తేడా అది జూలై 12న ప్రారంభించబడింది. ఈ కేంద్రం ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటివరకు సుమారు 482 కుటుంబాలకు మానవీయ దృక్కోణంతో పరిష్కారం లభించింది. వివాహ జీవితంలో వచ్చిన సమస్యల నుంచి, కుటుంబ సభ్యుల మధ్య వచ్చిన అంతరాల వరకూ ఈ సలహా కేంద్రం వందలాది కుటుంబాలను మళ్లీ ఒకచోట కలిపే సానుకూల వేదికగా నిలిచింది. ఈసంవత్సరం కాలంలో 748 కుటుంబ సదస్సులు నిర్వహించబడ్డాయి. మానసిక నిపుణులు, చట్ట నిపుణులు, కౌన్సిలర్ల సహకారంతో 482 కేసులు సంతృప్తికరంగా పరిష్కరించబడ్డాయి. 181 మందిని గృహ హింస కేంద్రానికి సూచించబడింది. 58 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయగా, 27 మందివి పెండింగ్‌లో ఉంది. అవగాహన కార్యక్రమాలు, మహిళా శక్తీకరణంపై శిక్షణలు, వర్క్‌షాప్‌లు నిర్వహించి మహిళలకు న్యాయబద్ధమైన మార్గదర్శకత కల్పించబడింది.

జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ భద్రతకు ఇది ఒక చైతన్య వేదికగా మారిందన్నారు. గత సంవత్సరం ప్రారంభించిన ఈ కుటుంబ సలహా కేంద్రం, సమస్యల పరిష్కారానికి ఒక దృఢమైన ఆధారంగా నిలుస్తూ సమాజంలో శాంతి, సుస్థిరతకు దోహదం చేస్తోందని అన్నారు. ప్రతి కుటుంబం సమాజానికి ఒక మూలస్తంభమని, ఈ కేంద్రం ఆ మూలస్తంభాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. ఈ ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ ద్వారా కుటుంబ సభ్యుల మధ్య పరస్పర నమ్మకాన్ని పెంపొందించడమే కాక, మహిళలు న్యాయంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను చెప్పగలిగే ఒక విశ్వాస వేదికను ఏర్పరిచిందని తెలిపారు. చట్టపరమైన కౌన్సిలింగ్, మానసిక మద్దతు వంటి అనేక విభాగాల్లో బాధితులకు మార్గనిర్దేశనం అందిస్తోందన్నారు. ఈ కుటుంబ సలహా కేంద్రం అనేది మొదటి అడుగు అని ఇది ఇప్పటివరకు చూపిన ఫలితాలు చూస్తే, భవిష్యత్తులో ఇది మరింత మంది జీవితాల్లో శాంతి, సమానత్వం తీసుకురాగలదని అన్నారు. మన సమాజంలో ప్రతి ఒక్కరిలోనూ బాధ్యత ఉంటే, మహిళలపై హింసకు పూర్తిగా అడ్డుకట్ట వేయవచ్చు అని, ప్రతి వ్యక్తి ఈ మార్పులో భాగస్వామి కావాలని, తమ వంతు కృషి... మీ మద్దతుతో సమాజంలో మంచి మార్పు తప్పకుండా వస్తుందని జిల్లా ఎస్పీ ఆశాభావం వ్యక్తం చేశారు.

మీడియా హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

- శివకుమార్‌ను పరామర్శించిన మంత్రి రాంప్రసాద్ రెడ్డి
- రూ.2 లక్షల ఆర్థిక సాయం అందజేత



శివకుమార్‌ను పరామర్శిస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మీడియా హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ శివకుమార్‌పై దాడిని ఖండించిన మంత్రి చిత్తూరు ఆసుపత్రిలో శివకుమార్‌ను శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితునికి రూ. 2లక్షల ఆర్థిక సహాయం అందించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ వైసీపీ రౌడీ మూకల దాడి తీవ్రంగా కలచి వేసిందని, మీడియా హక్కుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జగన్ పర్యటనలో మహిళ స్పృహ తప్పిన ఘటన, కానిస్టేబుల్ చొక్కా చింపేయడం, మీడియా ఫోటోగ్రాఫర్‌పై దాడి తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర విలువైనదని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

ఫోటోగ్రాఫర్‌పై దాడి ఘటనలో ముగ్గురు నిందితుల అరెస్ట్

రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి బంగారుపాళ్యం పర్యటనలో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ శివ కుమార్‌పై జరిగిన దాడి ఘటనలో చక్రవర్తి, వినోద్ కుమార్, మోహన్‌లను నిందితులుగా గుర్తిస్తూ బంగారుపాలెం పోలీసులు అరెస్టు చేశారు. ఈనెల9వ తేదీన జగన్ మోహన్‌రెడ్డి మామిడి రైతులతో ముఖాముఖి కార్యక్రమం పర్యటనలో భాగంగా కార్యక్రమాన్ని అక్కడే ఉండి కవర్ చేస్తున్న ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ పై కొందరు వ్యక్తులు దాడి చేశారు. ఈ దాడిపై శివకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంగారుపాలెం ఇన్స్పెక్టర్ శ్రీనివాస రావు, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు, పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్ పర్యవేక్షణలో పలు సెక్షన్ల కింద పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. శుక్రవారం వారికి అందిన సమాచారం మేరకు పోతంబట్టు బస్‌స్టాప్‌లో నిందితులను అరెస్ట్ చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు.



దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేసి మీడియాకు చూపుతున్న పోలీసులు

ఏనుగుల గుంపు హల్‌చల్..!

- బెంబేలెత్తుతున్న అటవీ ప్రాంత ప్రజలు
- అప్రమత్తంగా ఉండాలన్న అటవీశాఖ

ప్రజాశక్తి - రామకుప్పం: మండల పరిధిలోని అటవీ సరిహద్దు ప్రాంతమైన చిక్కపల్లి తాండా పరిసరాల్లో శుక్రవారం రాత్రి ఏనుగుల గుంపు హల్‌చల్ చేసింది. రెండు గున్నాలతో ఉన్న ఆరు ఏనుగుల గుంపు పలువురు రైతులకు చెందిన పంటపోలాలను తిన్నంత తిని తొక్కి నాశనం చేశాయి. నెలరోజులుగా ఒంటరి ఏనుగు ఇక్కడి అటవీ సరిహద్దు గ్రామాల్లోకి వచ్చి పంటలను నాశనం చేస్తోంది. మరోవైపు ఆరు ఏనుగుల గుంపు పలు గ్రామాల పంటలపై పడి రైతులను, ప్రజలను బేంబేలెత్తిస్తుడటంతో ఏ రాత్రి, ఏ గ్రామం వైపు గజరాజులు తరలి వస్తాయోనని అటవీ సరిహద్దు గ్రామాల జనం హడాలిపోతున్నారు. ముఖ్యంగా అటవీ సమీపప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం ఆరు ఏనుగుల గుంపు నారాయణపురం తాండా అటవీ ప్రాంతంలోనీ చీకలగట్టు ప్రదేశంలో ఉన్నాయని కావున, రామాపురం తాండా, నారాయణపురం తాండా, కోటచేను, నానియాల తాండా, జీడిమాకులపల్లె గ్రామ ప్రజలు అందరూ అప్రమత్తంగా ఉండి, రాత్రిలో ఎవరూ ఒంటరిగా పొలాలు దగ్గరకి, అడివిలోకి వెళ్ళవద్దన్నారు. పంట పొలాల వద్ద కరెంట్ తీగలు ఏనుగుకి తగిలేంత ఎత్తులో ఉంటే దయచేసి వాటిని తొలిగించండి. ఏనుగులకు సంబంధించిన సమాచారం ఫారెస్ట్ అధికారులు వారి ఫోన్ నెంబర్లు 63016 67521, 99662 38653 వెంటనే ఫారెస్ట్ డిపార్ట్మెంట్ వారికి సమాచారం అందించాల్సిందిగా కోరారు.

'సుపరిపాలనలో తొలి అడుగు'



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు కార్పొరేషన్ పరిధిలోని కాజూరులో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు, ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డితో కలిసి చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నగర మేయర్ అముద పాల్గొన్నారు. కాజూరుకి విచ్చేసిన రాష్ట్ర మంత్రికి కూటమి నాయకులు ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రజల ఇంటి వద్దకు వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలను పంచిపెట్టారు. చూడా చైర్‌పర్సన్ కటారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్ రెడ్డి, పుంగనూరు నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి చల్లా బాబు, టిడిపి సీనియర్ నాయకులు కాజూరు బాలాజీ, కాజూరు రాజేష్ పాల్గొన్నారు.

ఎంపీ నిధులను మంజూరు చేయాలని కోరిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్, యాదమరి: పూతలపట్టు నియోజకవర్గ అభివృద్ధికి ఎంపీ నిధులను మంజూరు చేయాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావుకు పూతలపట్టు శాసనసభ్యులు కలికిరి మురళీమోహన్ విజ్ఞప్తి చేశారు. కొత్తగా ఎన్నికైన మండలాధ్యక్షులు, టీడీపీ నేతలతో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఇందుకు చిత్తూరు పార్లమెంటు సభ్యులు సానుకూలంగా స్పందించారు. పూతలపట్టు అభ్యున్నతికి తన సహాయ సహకారాలు అందించేందుకు వెనకాడబోనని ఎంపీ వారికి భరోసానిచ్చారు. పోల్ మేనేజ్మెంట్ కో-ఆర్డినేటర్ గిరిధర్ బాబు, టిడిపి సీనియర్ నాయకులు ఉప్పులపాటి బాబు రావు, సురేంద్ర నాయుడు, దేవాజీ, దాము, అర్జున, జ్ఞాను చౌదరి, ధరణి, మాధవరావు, కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.



సర్కారు తీరుకు నిరసనగా సమ్మె..

'ప్రజాదృష్టి'

- జిల్లాలో సమ్మె విజయవంతం

ప్రజాశక్తి- తిరుపతి సిటి

కార్మికులు దశాబ్దాలు తరబడి పోరాడి, వేలాది మంది ప్రాణత్యాగాలతో సాధించుకున్న హక్కులను పాలకులు హరించడం అవివేకం. మోడీ పాలనలో దేశం మొత్తం అతలాకుతలమవుతోంది. కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, విద్యార్థులు ఒకరేంటి అందరూ అవస్థలు పడుతూనే (ఒక కార్పొరేట్ శక్తులు తప్ప) ఉన్నారు. మోడీ సర్కారు అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక నిర్ణయాలకు నిరసనగా దేశవ్యాప్త సమ్మెకు కార్మికరంగం పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా ఈ నెల 9న చిత్తూరు జిల్లాలోని 32 మండలాల్లో సమ్మెను విజయవంతంగా నిర్వహించడం గమనార్హం.


మనదేశంలోని పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కేంద్ర బిజెపి మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్‌కోడ్స్ తెచ్చింది. వీటిని రద్దు చేయాలని, కనీస వేతనం రూ. 26వేలు, ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ విరమణ, స్కీమ్స్‌లో పనిచేసే వారిని కార్మికులుగా గుర్తింపు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ రద్దు, సమాన పనికి సమాన వేతనం తదితర సమస్యల పరిష్కారినికై కార్మిక, ఉద్యోగ సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చాయి. దేశ వ్యాప్తంగా సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా జరిగిన 22 సమ్మెలకు ఈ సమ్మెకు చాలా వ్యత్యాసం ఉంది. ఇతర 16 డిమాండ్లు ఉన్నా అన్నింటిలోనూ లేబర్ కోడ్‌లను అడ్డుకోవడం ప్రధాన అంశం. లేబర్ కోడ్‌లు అమలులోకి వస్తే చట్టాలు వర్తించే కార్మికులు, వర్తించని కార్మికులు అందరు బానిసత్వంలోకి నెట్టబడుతారు. ప్రస్తుతం అమల్లో ఉన్న కార్మిక చట్టాలన్నీ కార్మికవర్గం ఐక్యంగా ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్నవే తప్ప ఎవరి దయా దాక్షిణ్యాల వల్ల పొందలేదు. స్వాతంత్రం రాకముందే బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా కార్మికవర్గం ఐక్యంగా పోరాడి ట్రేడ్ యూనియన్ యాక్టు 1926 (సంఘం పెట్టుకునే హక్కు), వేతనాల చెల్లింపుచట్టం 1936, పారిశ్రామిక వివాదాల చట్టం 1947 (ఇండస్ట్రియల్ డిస్ప్యూట్ యాక్ట్), స్టాండింగ్ ఆర్డర్స్ చట్టం 1946, వర్క్‌మెన్ కాంపెన్సేషన్ యాక్ట్ 1923, లాంటివి సాధించుకుంది. స్వాతంత్రానంతరం కనీస వేతనాల చట్టం 1948, పారిశ్రామిక సంబంధాల చట్టం 1956, ప్రావిడెంట్ ఫండ్ యాక్ట్ 1952, బోనస్ చట్టం 1965, గ్రాట్యూటీ యాక్ట్ 1972, తదితర కార్మిక చట్టాలన్నీ కార్మిక వర్గం ఐక్యంగా పోరాడి సాధించుకున్నవే.

నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారుల, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలు, లాభాలను మరింత పెంచడం కోసం లేబర్ కోడ్స్, ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్ (సులువుగా వ్యాపారం చేసుకోవడం), సబ్‌కాక సాత్‌సబ్‌కా వికాస్, మేకిన్ ఇండియా, అమృత్ కాల్, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఇలా రకరకాల నినాదాలతో దేశ ప్రజానీకాన్ని మభ్యపెట్టి రైల్వేలతో సహా ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిని ప్రయివేటీకరిస్తోంది. దేశ సంపదంతా కార్పేరేట్ శక్తులకు చౌకగా, ఉచితంగా కట్టబెడుతున్నది. కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించకకూడదనే, కార్మికోద్యమాలని అణగద్రొక్కటానికి లేబర్ కోడ్స్ తెచ్చింది. లేబర్ కోడ్స్ గనుక అమలైతే ట్రేడ్ యూనియన్స్ ఉనికికే ప్రమాదం ఏర్పడబోతుంది.

సమ్మె చేసే హక్కు, సంఘం పెట్టుకునే హక్కు, లేబర్ డిపార్టుమెట్‌లో సంప్రదించే హక్కు, కలెక్టివ్, బార్గెనింగ్‌లన్నీ ఉండవు. రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక హక్కులు హరించబడుతాయి. నియంతత్వ పోకడలు పెరుగుతాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తు తరాలకు అండగా ఈ లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలనే ప్రధాన లక్ష్యంతో కార్మిక, ఉద్యోగ సంఘాలు కలిసి దేశవ్యాప్త సమ్మె చేపట్టాయి. ఈనెల 9వ తేదీ చిత్తూరు జిల్లా వ్యాప్తంగా సిఐటియు, ఏఐటియుసి, ఐఎఫ్‌టియు, ఇతర ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్మికులు, ఉద్యోగులు విధులు బహిష్కరించి, రోడ్డెక్కి, ఎర్రజెండాలు చేబూని నిరసన ర్యాలీలు చేపట్టారు. చిత్తూరు, పలమనేరు, నగరి, కుప్పం, పుంగనూరులో నల్లబాడ్జీలు ధరించి ర్యాలీ చేశారు. కార్మికులకు ప్రజలు సైతం సహకరించి, సమ్మెలో పాల్గొనడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు మూతపడ్డాయి. ఎల్ఐసి కార్యాలయాలు, బ్యాంకులు, బిఎస్ఎన్ఎల్, పోస్టల్ కార్యాలయాలు స్తంభించాయి. జిల్లా వ్యాప్తంగా ఎక్కడ చూసిన ఎర్రజెండాల ర్యాలీలతో హోరెత్తింతి. ఇప్పటికైన కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తన తీరును మార్చుకుని, కార్మికులకు నష్టం చేకూర్చే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని లేని పక్షంలో పోరాటాలు మరింత ఉధృతం చేస్తామని కార్మికులు ఈ సమ్మె ద్వారా మరోసారి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు.

300 మంది ప్రధానోపాధ్యాయులకు నిపున్ శిక్షణ

సమగ్ర శిక్ష ఏపిసి మద్దిపట్ల వెంకటరమణ



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నూతన జాతీయ విద్యా విధానం - 2020లో భాగంగా జిల్లాలోని 300 మంది ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నేషనల్ ఇన్సియేటివ్ ఫర్ ప్రొఫిషియన్సీ ఇన్ రీడింగ్ విత్ అండర్ స్టాండింగ్ అండ్ న్యూమరసీ (నిపున్) శిక్షణను ఇప్పించనున్నట్లు జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో - ఆర్డినేటర్ మద్దిపట్ల వెంకటరమణ వెల్లడించారు. శనివారం ఆయన చిత్తూరులోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. నైపుణ్యం గల భారత్ తయారీ కోసమే గతంలో రెండు విడతలుగా జిల్లాలోని 1000 మందికి పైగా ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులకు నిపుణ భారత్ శిక్షణను ఇచ్చినట్లు తెలిపారు. మూడవ విడతలో భాగంగా ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు జిల్లాలో ఎంపిక చేసిన 300మంది ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు చిత్తూరు నగరంలోని మిట్టూరు అరుణాచల జూనియర్ కళాశాలలో జిల్లాలో సెమి రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర విద్యాశాఖ ద్వారా జిల్లాలోని అపార అనుభవం కలిగిన 10 మంది ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఈ నెల 14వ తేదీన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్ తదితరులు ప్రారంభిస్తారని వివరించారు. నాయకత్వ లక్షణాలు, వృత్తి నైపుణ్యాల పెంపు, విద్యార్థుల సామర్థ్యాన్ని పెంచి వారిలోని సృజనాత్మకతను వెలికితీయడం అనే అంశాలపై ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలల్లోని విద్యార్థులకు సంబంధిత అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చి నైపుణ్యం గల భారత్ తయారీలో భాగస్వామ్యులవుతారని వివరించారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని నాలుగు రోజుల పాటు జరిగే నిపున్ భారత్ శిక్షణ కార్యక్రమాలకు ఎంపిక చేసిన ప్రధానోపాధ్యాయులు తప్పక హాజరుకావాలని ఏపీసీ వెంకటరమణ తెలిపారు.

డిగ్రీ అడ్మిషన్లను వెంటనే చేపట్టాలి: ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్లు మొదలు కాకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారని తక్షణమే డిగ్రీ అడ్మిషన్లను ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు బాలసుబ్రమణ్యం, దాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిత్తూరు జిల్లాలో జిల్లా కేంద్రం చిత్తూరులోనూ పలమనేరు, కుప్పం మండలాల్లో డిగ్రీ కళాశాలలో విద్యార్థులు అడ్మిషన్ లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో గత ప్రభుత్వం ఉన్నత విద్యారంగంలో అనేక మార్పులు చేసింది. దీనివల్ల డిగ్రీ విద్యలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయని, ఈ విధానాలను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విమర్శించిన కూటమి పార్టీలు నేడు కొత్త విధానాన్ని రూపొందించకుండా డిగ్రీ ప్రవేశాలు ఆలస్యం చేయడం గర్హనీయమన్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సింగల్ మేజర్ సబ్జెక్టు విధానాన్ని తొలగించి డబల్ మేజర్ సబ్జెక్టు విధానం తెస్తున్నట్లు కూటమి నేతలు ప్రకటించిన కొద్ది రోజులకే మరల సింగల్ సబ్జెక్టు విధానాన్ని కొనసాగించాలని నిర్ణయించారని, డిగ్రీ ప్రవేశాలు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలా అనే విషయంలో కూడా ఈ ప్రభుత్వానికి స్పష్టత లేదని, ఉన్నత విద్య పట్ల ఇంత గందరగోళంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఇంటర్ పూర్తయి నాలుగు నెలలు గడుస్తున్నా డిగ్రీ ఆడ్మిషన్లు ప్రారంభం కాకపోవడంతో వేలాది విద్యార్థులు ఆందోళనలో ఉన్నారని, విద్యా సంవత్సరం ప్రారంభమే ఆలస్యం అయితే చివరిలో విద్యార్థులపై ఒత్తిడి పెరుగుతుందన్నారు. తెలంగాణతో పాటు మన పొరుగు రాష్ట్రాల్లో నెల రోజుల క్రితమే డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, మన రాష్ట్రంలో ఆలస్యం కావడంతో డిగ్రీలో చేరే విద్యార్థుల సంఖ్య తగ్గే అవకాశం ఉందన్నారు. కావున ప్రభుత్వం వెంటనే స్పష్టమైన విధానాలతో డిగ్రీ ఆడ్మిషన్లను వెంటనే ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తున్నదని తెలిపారు.

12వ దశలో 250 ఫోన్ల రికవరీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చాట్ బూట్ ద్వారా 12వ దశలో 250 ఫోన్లు రికవరీ చేసినట్లు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుండి రికవరి చేసి బాధితులకు అందజేశామన్నారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల నుండి మొబైల్ ఫోన్ల రికవరీ సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధ్యతలు అందజేశామని తెలిపారు. 250 మొబైల్ ఫోన్లను ట్రేస్ చేసిన చిత్తూరు పోలీస్ అధికారులు, సిబ్బందిని సర్టిఫికెట్స్ ఇచ్చి అభినందించారు. ప్రజలకు మంచి సేవలందించేందుకు చాట్ బాట్ బృందం మొబైల్ ట్రాకింగ్‌పై బాగా పని చేస్తున్నారన్నారు. పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు మన రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల నుండి మొబైల్ ఫోన్ల రికవరీ చేసి బాధితులకు అందజేస్తున్నామని తెలిపారు. ఇంకా పెండింగ్ రికవరీలు ఉన్నాయని వాటిని కూడా అతి త్వరలో రికవరీ చేసి బాధితులకు అందచేస్తామని తెలియజేశారు. మొబైల్ వివరాలను తెలియజేస్తే బాధితులకు త్వరితగతిన అందజేసేందుకు కృషి చేస్తామని తెలియజేశారు.



అశ్రునయనాలతో రాజమ్మకు..వీడ్కోలు

ప్రజాశక్తి-తిరుపతి టౌన్ : సిపిఎం సీనియర్ నేత, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాతృమూర్తి కందారపు రాజమ్మకు అశ్రు నయనాలతో కుటుంబ సభ్యులు శనివారం సాయంత్రం అంతిమ వీడ్కోలు పలికారు. అనారోగ్యంతో బాధపడుతూ తిరుపతిలోని సిమ్స్ ఆస్పత్రిలో శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందిన రాజమ్మ భౌతికకాయాన్ని సుందరయ్య నగర్‌లోని వారి స్వగృహంలో సందర్శనార్థం ఉంచారు. ఈ సందర్భంగా పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, మాజీ ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి, చంద్రగిరి వైసీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, టిటిడి పాలక మండలి సభ్యులు భానుప్రకాష్ రెడ్డి, సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, చిత్తూరు జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి, మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఆర్‌సి మునికృష్ణ రాజమ్మ భౌతిక కాయానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అశ్రునయనాల మధ్య సుందరయ్య నగర్, రైల్వే కాలనీ మీదుగా కరకంబాడి రోడ్డులోని గోవిందదామం వరకు అంతిమయాత్రను నిర్వహించి, అంత్యక్రియలు నిర్వహించారు.

అనాథలను చేస్తున్న రోడ్డు ప్రమాదాలు

- ప్రాణాలు తీస్తున్న అతివేగం
- అధికారుల నిఘా, పర్యవేక్షణ కరువు
- తగ్గని ప్రమాదాలు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: అతివేగం ప్రాణాలు తీస్తోంది. అజాగ్రత్త, అప్రమత్త లేమి నిండు కుటుంబాలను బలి తీసుకుంటోంది. ఎన్నో బాధిత కుటుంబాలు వీధిన పడుతున్నాయి. ఆ కుటుంబాల జీవితం ప్రశ్నార్థకంగా మారుతుంది. సాంకేతిక వ్యవస్థ రహదారుల్లో లేక పోవడంతో మృత్యు ఘోష వినపడుతోంది. ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం, పర్యవేక్షణ కరువవడంతో ఈ ప్రమాదాలతో కుటుంబాలు సభ్యులను కోల్పోయి వారు పడుతున్న బాధ వర్ణనాతీతంగా మారాయి.

అనాథలను చేస్తున్న రోడ్డు ప్రమాదాలు

గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో వెదురుకుప్పం, కార్వేటినగరం, ఎస్‌ఆర్‌పురం, పాలసముద్రం, గంగాధర నెల్లూరు, పెనుమూరు మండలాలు వున్నాయి. ఈ మండలాలలో ఉపాధి కోసం కుటుంబాల వారు పట్టణాల వైపు నిత్యం ప్రయాణాలు చేస్తుంటారు. కొంతమంది ఆర్టీసి బస్సులు, ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలలో తమ ప్రయాణాలను కొనసాగిస్తుంటారు. వారికి కనీస భద్రత కూడా ఉండదు. వారికి మదిలో మెదిలే ది సమయానికి ఉపాధి లభించే స్థలానికి చేరుకోవాలి. సమయం మించితే యాజమానుల దగ్గర మాట పడాల్సి వస్తుందనేది వారి భయం. ఈ మండల వాసులకు ప్రధానంగా పక్క రాష్ట్రాలైన బెంగళూరు, చెన్నై, తెలంగాణ లకు జీవనోపాధి కోసం నిత్యం వెళ్లి వస్తుంటారు. ఆర్‌టిసి బస్సులు సకాలంలో అందుబాటులో ఉండవని, కొంతమంది ద్విచక్ర వాహనాలలో, సొంత కార్లలో, ఆటోలపై ఆధారపడి పట్టణాల నుంచి సొంత గ్రామాలకు, గ్రామాల నుంచి పట్టణాలకు రాకపోకలు సాగిస్తుంటారు. వారు వెళ్లే వాహనాలు తరచూ ప్రమాదాల బారిన పడి వారి కుటుంబాల వారు అనాథలుగా మిగులుతున్నారు.

ప్రాణాలు తీస్తున్న అతివేగం

గంగాధర నెల్లూరు నియోజకవర్గ నుంచి తిరుపతికి, చిత్తూరు, పట్టణాలు నగరాలకు రైతులు, కూలీ పనులు కూలి పనులు చేసుకునేవారు, ఉద్యోగులు నిత్యం వస్తూ, పోతూ వుంటారు. రోజుకు నియోజకవర్గం నుంచి వందలాది మంది పట్టణాల వైపు పరుగులు తీస్తుంటారు. వారు వెళ్లే వాహనాలు డ్రైవర్ల అతివేగం, అవగాహన లేమి కారణంగా అప్పుడప్పుడూ ప్రమాదాలకు గురవుతున్నాయి. రోడ్లపై ముందు వాహనాలను అధిగమించే ప్రయత్నంలోనో, అతివేగం కారణంగానో రోడ్లపై ప్రమాదాల బారిన పడి మృత్యువాత పడుతున్నారు. ఫలితంగా వారిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబ సభ్యులు అనాథలుగా మారి రోడ్డున పడుతున్నారు.

నిఘా అధికారుల పర్యవేక్షణ కరువు

ఇలా రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు సంబంధిత నిఘా అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు తాత్కాలిక చర్యలు చేపడుతున్నారు. ఆ తర్వాత మళ్లీ నిర్లక్ష్యం యథాప్రకారం కొనసాగుతోంది. ఈ కారణంగా పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ కచ్చితంగా ధరించాలి. మద్యం తాగి వాహనాలు నడపకూడదు. సెల్‌ఫోను మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదు. మైనర్లు వాహనాలు నడపకూడదు. ట్రాఫిక్ రూల్స్‌పై యువతకు అవగాహన ఉండాలి. ఈ జాగ్రత్తలు వాహనదారులు పాటించాల్సి వుంది. వీటిపై సంబంధిత శాఖాధికారులు నిఘా వేసి పర్యవేక్షించాల్సిన అవసరం వుంది. గతంలో రహదారులపై పోలీసులు వాహనాలను తనిఖీ చేసి నిద్ర మత్తులో వున్న డ్రైవర్లను గుర్తించి వెంటనే వారిని కొంత సమయం వాహనాలు ఆపించి నిద్రించి వెళ్లమని చెప్పడం, నిఘా వుంచి వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపేవారు. అయితే ప్రస్తుతం అధికారుల నిఘా లోపించడం వల్లే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు వాపోతున్నారు.

పలు రోడ్డు ప్రమాదాలు..

వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్య ఆచారి (62) ఐదు రోజుల క్రితం సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై తిరుపతికి వెళ్లాడు. మార్గ మధ్యంలో రామ చంద్రాపురం మండలం, గంగిరెడ్డిపల్లె సమీపంలో రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. వారి ముగ్గురు అనాథలుగా మిగిలారు.

నెల క్రితం గంగాధర నెల్లూరు మండలం, తూగుండ్రం గ్రామానికి చెందిన చిత్తూరు 2 డిపో ఆర్టీసీ డ్రైవర్ కరుణాకర్ రెడ్డి, కర్నాటక హోస్కోట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో విగత జీవుడు అయ్యాడు. అతని భార్యాబిడ్డలు అనాథలుగా మిగిలారు.. ఇలా చోటుచేసుకున్న ప్రమాదాలు కోకొల్లలుగా వున్నాయి. ఈ ప్రమాదాల నివారణకు నిఘా వుంచి తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ద్విచక్ర వాహన ప్రమాదంలో మృతి చెందిన సుబ్రహ్మణ్య ఆచారి (ఫైల్ ఫోటో)

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనదారులు హెల్మెట్ కచ్చితంగా ధరించాలి. మద్యం తాగి వాహనాలు నడప కూడదు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదు, మైనర్లు వాహనాలు నడప కూడదు. ట్రాఫిక్ రూల్స్ పై యువతకు అవగాహన ఉండాలి. ఈ జాగ్రత్తలు వాహన దారులు పాటించాలి. ఇవి పాటిస్తే ప్రమాదాలు తగ్గించ వచ్చు. గంగాధర నెల్లూరులో ప్రమాదాల శాతం చాలా వరకు తగ్గింది.

-శ్రీ నివాసంతి, సిఐ, గంగాధర నెల్లూరు.

క్రైం న్యూస్

బస్సును ఢీకొన్న వాహనం
డ్రైవర్‌కి గాయాలు

ప్రజాశక్తి- బంగారు పాలెం: బస్సును ఐచర్ ఢీకొని ఐచర్ డ్రైవర్‌కు గాయాలైన సంఘటన శనివారం మండలంలోని మహాసముద్రం టోల్ ప్లాజా వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు. బంగారుపాలెం నుండి చిత్తూరుకు వెళుతున్న బస్సు బెంగళూరు నుండి చిత్తూరు వైపు వెళుతున్న ఐచర్ వాహనం ముందు వెళుతున్న బస్సు వెనక భాగంలో ఢీకొంది. ఈ సంఘటనలో కర్ణాటకకు చెందిన ఐచర్ డ్రైవర్ సలీంకు గాయాలు కాగా చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి లోచికిత్స అందించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మాట్లాడుతున్న భీమ్‌రావు యశ్వంత్ అంబేద్కర్

నగరి ప్రజల ఆదరణ మరువలేనిది

- డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మనవడు భీమ్‌రావ్ యశ్వంత్ అంబేద్కర్

ప్రజాశక్తి -విజయపురం (నగరి): అంబేద్కర్ స్థాపించిన ఆర్గనైజేషన్లను దేశవ్యాప్తంగా తీసుకెళ్లడమే తన కర్తవ్యం అని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మనవడు, ఆల్ ఇండియా బుద్దిస్ట్ సొసైటీ జాతీయ అధ్యక్షుడు భీమ్‌రావ్ యశ్వంత్ అంబేద్కర్ అన్నారు. శనివారం మధ్యాహ్నం బస్టాండు ప్రాంగణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. స్థానిక నేతలు ఆయనను ఘనంగా స్వాగతించారు. ఆయన అంబేద్కర్ విగ్రహానికి పూలదండ వేసి నివాళులర్పించారు. ఇటీవల రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా, సమ్‌తా షైనింగ్ వెల్ అండ్ గుడ్‌డే సొసైటీ ఆఫ్ ఇండియా ఆర్గనైజేషన్లు కూడా ప్రారంభించామన్నారు. ఈ మూడు ఆర్గనైజేషన్లు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ పునాదివేసిందే అన్నారు. దేశవ్యాప్తంగా ఈ మూడు ఆర్గనైజేషన్లను స్థాపించడే తన ధ్యేయమన్నారు. ఈ ఆర్గనైజేషన్లు వెనుక బడిన సామాజిక వర్గాల సమస్యల పరిష్కారానికి తోడ్పడుతుందన్నారు. ఎన్నో పార్టీలు వస్తున్నాయని, అంబేద్కర్ పేరును వాడుకుంటున్నాయి. ఆ పార్టీలకు మనం ఓటేస్తున్నాం. అయితే ఆ పార్టీలు మన సామాజిక వర్గానికి ఎలాంటి సదుపాయాలు కల్పించడం లేదన్నారు. నగరి ప్రజలు డైయింగ్ యూనిట్ల నుంచి వచ్చే కలుషిత నీటి సమస్యతో సతమతమవుతున్నారన్నారు. ఇలాంటి సమస్య దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఉందన్నారు. స్వచ్ఛమైన నీరు అందించడం, ప్రజారోగ్యాన్ని పరిరక్షించడం ప్రభుత్వాల బాధ్యత అన్నారు. నగరికి రావడం ఇదే ప్రథమమని ఇక్కడి ప్రజల ఆదరణ మరువలేనిదని ఇక్కడ అంబేద్కర్ ఆశయాలు అనుసరించేవారు ఎక్కువగా ఉన్నారన్నారు. నగరి ప్రజల కలుషిత నీటి సమస్య పరిష్కారానికి తమ ఆర్గనైజేషన్ అండగా నిలుస్తుం దన్నారు. ఈ సమస్యపై త్వరలో ఒక సమావేశం ఏర్పాటుచేసి కలెక్టర్ దృష్టికి అవసరమైతే ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరించు కుందామన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎఫ్ జాతీయ అధ్యక్షులు తిరునావుక్కరసు, రాష్ట్ర అధ్యక్షులు గజేంద్ర, ఆర్‌పీఐ పార్థసారథి, బీఎస్పీ నేత ధనంజేయులు, ఉమాపతి, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు బీడీ భాస్కర్, లాయర్ నాగరాజు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు భూమిపూజ



అన్న క్యాంటీన్‌కు భూమిపూజ నిర్వహిస్తున్న మంత్రులు

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరులో సుపరి పాలనలో తొలి అడుగులో భాగంగా అన్న క్యాంటీన్ నిర్మాణానికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శనివారం భూమి పూజ నిర్వహించారు. గంగాధర నెల్లూరు సొసైటీ బ్యాంకు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో అన్న క్యాంటీన్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ థామస్, చిత్తూరు ఎంపీ దుగ్గమల్ల ప్రసాద్ రావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, పుంగనూరు ఇన్‌ఛార్జి చల్లా బాబు, ఎంపీడీవో కృష్ణ మహేశ్ రెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ వరదరాజులు, టిడిపి నాయకులు కృష్ణమ నాయుడు, చిట్టి బాబు నాయుడు, శ్రీధర్ యాదవ్, స్వామి దాస్, దేవ సుందరం, హరీష్ యాదవ్, ప్రసాద్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండలంలోని తూగుండ్రం పంచాయతీ కొండ్రాగ దళితవాడ స్కూలు చదివే పిల్లలకు, కొండ్రాగ గ్రామంలోని ఒకటవ తరగతి నుండి కాలేజీ విద్యార్థులకు పేద పిల్లలకు చేయూత అందించాలని ఉద్దేశంతో ఒకటవ తరగతి నుండి డిగ్రీ చదివే వారికి రిటైర్డ్ టీచర్లు విమలమ్మ శ్రీనివాసులు వారి ఆర్థిక సహాయంతో పదివేల రూపాయలు విలువచేసే విద్యా సామాగ్రి శనివారం కండ్రిగ దళితవాడలోనే స్టూడెంట్స్ కి పిల్లలకి టిడిపి బూత్ కన్వీనర్ శంకర్, సి ఆర్ పి గుణశేఖర్ విద్యార్థులకు స్కూల్ పిల్లలకు పంపిణీ చేశారు.



నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్నదాతలు

గణిత అవధానికి ఘన సన్మానం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: స్థానిక బృందావనం ఇంగ్లీష్ మీడియం స్కూల్లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ గణిత ఫోరం సమావేశం లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించిన గణిత అవధాని అరుణ శివప్రసాద్‌ను శనివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏపీఎంఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు నాలుగు వరల్డ్ బుక్ రికార్డు సాధించడం గణిత ఉపాధ్యాయులకే గర్వకారణమన్నారు. విజయం విద్యా సంస్థల యజమాని శైలజ మాట్లాడుతూ అరుణ శివప్రసాద్ ఎందరో విద్యార్థులకు గణిత శాస్త్రంలో అవగాహన కల్పించి ఉత్తమ మార్కులు సాధించేందుకు కృషి చేశారని తెలిపారు. ఏపీ ఎంఎఫ్ సభ్యులు అరుణ శివప్రసాద్ కు బంగారు కంకణం తొడిగి జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో జయంతి, వేణుగోపాల్ ,తులసి, హంస ,హరిప్రియ, బాలయ్య, భాస్కర్, పిల్లారప్ప పాల్గొన్నారు . ఈ సందర్భంగా ఉద్యోగోన్నతి పొందిన ఉపాధ్యాయులను సత్కరించారు.

డిసిసి కార్యదర్శిగా సెల్వం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: జిల్లా కాంగ్రెస్ కార్యదర్శిగా గుడిపాల మండలానికి చెందిన సెల్వం ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ , చిత్తూరు జిల్లా ఇన్‌చార్జ్ రాంభూపాల్ రెడ్డి, చిత్తూరు నియోజకవర్గం కోఆర్డినేటర్ , చిత్తూరు నగర అధ్యక్షులు టిక్కి రాయల్ నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సెల్వం మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా కార్యదర్శిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిల, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తలిపారు. జిల్లాలో కాంగ్రెస్ అభివృద్ధికి శాయశక్తులా పని చేస్తానని తెలిపారు.

శివకుమార్‌కు పరామర్శ



శివకుమార్‌ను పరామర్శిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి -వెదురుకుప్పం: ఇటీవల బంగారుపాలెంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నిర్వహించిన పర్యటన సందర్భంగా ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ శివకుమార్ గాయపడిన సంగతి విదితమే.. చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శివకుమార్‌ను పెనుమూరు మాజీ సర్పంచ్, టిడిపి నేత కృష్ణమూర్తి నాయుడు, వెదురుకుప్పం టిడిపి మాజీ మండల అధ్యక్షులు మాజీ ఎంపీటీసీ మోహన్ మురళి శనివారం పరామర్శిం చారు. ఈ సందర్భంగా వారు శివకుమార్ ఆరోగ్య పరిస్థితిని తెలుసు కుని, దాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మీడియా ప్రతినిధులపై ఇలాంటి దాడులు చాలా హేయమైనవని ప్రజాస్వామ్య విలువలకు విఘాతమని తెలిపారు. పత్రికా విలేకరుల భద్రతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని టిడిపి నేతలు పేర్కొన్నారు.



ఐరాలలో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి -చిత్తూరు (యాదమరి): పూతలపట్టు నియోజకవర్గం పరిధిలో అనారోగ్యం బారిన పడి చికిత్స పొందిన వారికి సీఎం సహాయ నిధి ద్వారా లబ్ధిదారులకు మంజూరు అయిన సీఎం సహాయ నిధి చెక్కులను పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ శనివారం పంపిణీ చేశారు. చిత్తూరు లక్ష్మీనగర్ కాలనీలో పూతలపట్టు ఎమ్మెల్యే కార్యాలయంలో ఆ నియోజక వర్గానికి చెందిన పలు మండలాలకు చెందిన ఏడుగురు లబ్ధిదారులు కు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు భానుప్రసాద్ రెడ్డికి రూ.312790, జి జయమ్మకి రూ. 37,887, లోకనాథ్ రెడ్డికి రూ.80334, యన్ సురేష్ కుమార్‌కి రూ. 26,000, వి గురుస్వామికి రూ.55234, జ్యోతి రావుకి రూ. 2,00,109 చొప్పున చెక్కులు పంపిణీ చేశారు.

ఐరాల: ఐరాల మండలం, కామినేనిపల్లె పంచాయతీ, చిన్నవెంకటంపల్లెకు గ్రామానికి చెందిన భానుప్రకాష్ రెడ్డికి పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ శనివారం అందించారు. చిత్తూరు లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే మురళీ మోహన్ కార్యాలయంలో చిన్నవెంకటంపల్లె గ్రామానికి చెందిన లబ్ధిదారుడు భానుప్రకాష్ రెడ్డికి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన రూ. 3,12,790 చెక్కును ఎమ్మెల్యే మురళీమోహన్ అందించారు. సీఎం సహాయ నిధి చెక్కు అందుకున్న భానుప్రకాష్ రెడ్డి సీఎం, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐరాల మండల అధ్యక్షులు గంగారపు హరిబాబు నాయుడు, పూతలపట్టు నియోజకవర్గం పోల్ మేనేజ్‌మెంట్ అధ్యక్షులు గిరిధర్ బాబు, కాణిపాకం మాజీ ఆలయ ఛైర్మన్ మణి నాయుడు, నాగేశ్వరరావు, గిరింధర్ నాథ్, తులసీ రామ్‌లు పాల్గొన్నారు.

నేడు స్వాతంత్ర్య పోరాట యోధుల విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: స్వాతంత్ర పోరాట యోధులు మరుదు సోదరుల విగ్రహాలను స్థానిక గంగినేని చెరువు వద్ద ఆదివారం ఆవిష్కరించనున్నట్లు మొదలియార్ సంఘం అధ్యక్షులు బుల్లెట్ సురేష్ తనయులు బుల్లెట్ అప్పు తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక దొడ్డిపల్లిలో ఆహ్వాన పత్రికలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మొదలియార్ సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్యం పట్టదా?

- నిద్రావస్థలో అధికారులు
- ఆందోళనలో దాసార్లపల్లి ప్రజలు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలంలోని కంభంపల్లి పంచాయతీ పరిధిలోని దాసార్లపల్లి గ్రామంలో పారిశుధ్యం పూర్తిగా లోపించింది. అధికారులు స్పందించకపోవడంతో దాసార్ల పల్లి గ్రామ వాసులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

అందని తాగునీరు

గ్రామంలో తాగునీరు సకాలంలో అందడం లేదు.. డ్రైనేజీ లలో పురవీధుల పక్కనే ఉన్న తాగునీటి కుళాయి సమీపంలో మురికి నీరు నిల్వ ఉండడంతో ఆ నీరు చిన్నచిన్న పురుగులకు నిలయంగా మారింది. తాగు నీటి కుళాయిలకు మూతలు బిగించకపోవడంతో రాత్రి వేళల్లో నీరు వృథాగా వెళుతున్నాయి. దీని ప్రభావం వల్ల గ్రామంలో తాగునీటి సమస్య అధికమైంది.



నీరు నిలిచిపోవడంతో పురుగులకు నిలయంగా మారిన మురుగు కాలువ

నిద్రావస్థలో అధికారులు

పారిశుధ్యలోపం సమస్యపై అధికారులు నిద్రావస్థ వీడి వెంటనే స్పందించాలని స్థానికులు కోరు తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పారిశుధ్య లోపం, తాగునీటి సమస్య పరిష్కరిం చాలని గ్రామ మహిళలు కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వం దగా..

కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన ఉపాధ్యక్షులు రాంగోపాల్ రెడ్డి

ప్రజాశక్తి-పూతలపట్టు : కూటమి ప్రభుత్వం అలివికాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తోందని కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన ఉపాధ్యక్షులు రాంగోపాల్ రెడ్డి ఆరోపించారు. శనివారం పూతలపట్టు ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌ను గ్రామ స్థాయి నుంచి పూర్వ వైభవం తేవడానికి కొత్త కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఇందులో పూతలపట్టు నియోజక వర్గం కోఆర్డినేటర్‌గా ప్రభాకర్‌ను ఎన్నుకున్నామన్నారు. ప్రభుత్వం పై ఉద్యమానికి ఈ కమిటీలు ఎంతో దోహద పడతాయన్నారు. చంద్రబాబు సొంత జిల్లా అయిన మామిడి రైతుల బాగోగులు పట్టించుకోకపోవడం విచారకర మన్నారు. చిత్తూరు జిల్లాలో మామిడి రైతులు ఇబ్బందులు పడుతున్నది పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వల్లే అని, ఫ్యాక్టరీలో యాజమాన్యులతో సిండికేట్ కావడంతోనే ఈ పరిస్థితి నెలకొందన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షులు భాస్కర్ మాట్లాడుతూ బంగారు పళ్లెంలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై దాడి చేయడం దారుణం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు బీసీ సంగం జిల్లా అధ్యక్షులు దొరసామి, పరదేశి కుమార్ రెడ్డి, అంబిక, పూర్ణచంద్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఆవు ప్రాణాలు రక్షించాడు..

ప్రజాశక్తి -వెదురుకుప్పం: వైద్య స్ఫూర్తితో తన సిబ్బంది కృషితో గర్భంతో ప్రాణాపాయ స్థితిలో వున్న ఓ పశువును ఆ డాక్టరు రక్షించాడు. తన పాడి ఆవు ప్రాణాలు రక్షించి నందుకు ఆ రైతు ఆ డాక్టరుకు కృతజ్ఞతలు తెలుపు కున్నా డు. జిడి నెల్లూరు నియోజకవర్గ పరిధిలోని వెదురుకుప్పం మండలం మాంబేడు గ్రామానికి చెందిన కామసాని కనుగొండారెడ్డికి పాడి పరిశ్రమ వుంది. శనివారం ఓ ఆవు కాన్పుకు వచ్చింది. ఉదయం 5 గంటల నుంచి నొప్పులతో విలపిస్తున్న పశువు పరిస్థితిని గమనించి ఆ రైతుకు పచ్చికాపల్లం పశు వైద్యశాల లైవ్ స్టాక్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న మధుకి సమాచారం అందించాడు. వెంటనే స్పందించిన ఆయన హుటాహుటిన అక్కడికి చేరుకున్నాడు. గర్భంలో దూడ మృతి చెందిందని నిర్ధారించుకుని రైతుకు ధైర్యం చెప్పాడు. గర్భంలో ఇరుక్కుపోయిన మృత దూడను చాకచక్యంగా బయటకు తీశాడు. ఓ గంట ఆ ఆవు దగ్గరే వుండి ఆరోగ్య స్థితి మెరుగు పడే వరకు డాక్టరు పర్యవేక్షించాడు. తన ఆవు ప్రాణాలు కాపాడి నందుకు ఆ రైతు కుటుంబ సభ్యులు అతనికి కృతజ్ఞతలు తెలిపారు.



పశువుకు వైద్యం అందిస్తున్న పశువైద్యశాల లైవ్‌స్టాక్ అసిస్టెంట్ మధు

పోలీసుల 'పల్లెనిద్ర'

ప్రజాశక్తి -రొంపిచర్ల : రొంపిచర్ల మండలం బండ కిందపల్లె గ్రామంలో శనివారం రాత్రి రొంపిచర్ల ఎస్ఐ బి సుబ్బారెడ్డి పల్లెనిద్ర నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులకు సైబర్ క్రైమ్ గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాల్య వివాహాలు చేయకూడదని గ్రామస్తులు వాహనాల్లో ప్రయాణిం చేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని అన్నారు. పిల్లలంతా పాఠశాలలో ఉండాలని సూచించారు. గ్రామస్తులు ఎవరైనా సొంత పనిమీద ఊరు విడిచి వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం ఇచ్చి వెళ్లాలన్నారు. అనంతరం గ్రామస్తులతో కలిసి పని నిద్రకు ఉపక్రమించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్, శోభన్ బాబు, రాజశేఖర్, రవి, నాయకులు వి మదన్ మోహన్ రెడ్డి, భాస్కరయ్య, ఖాదర్ వలీ, అంజద్, అమర్నాథ్ రెడ్డి, లాల్ బాషా, రామయ్య పాల్గొన్నారు.



బండకిందపల్లె గ్రామంలో ప్రజలతో పల్లె నిద్ర నిర్వహించిన ఎస్ఐ బి సుబ్బారెడ్డి

IN THE COURT OF 2ND ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION) OF CHITTOOR
O.S.No.1125 of 2022

Between:
M.Chandra Sekharam ...Plaintiff
And:
1) G.K.Suma, 2) T.H.Thaneesh,
3) T.Sakkubhayamma. ....Defendants

SUMMONS TO THE DEFENDANTS No.1 & 2

D-1) G.K.Suma, W/o late T.Hemadri Naidu,
D-2)T.H.Thaneesh, S/o late T.Hemadri Naidu.
Native of Bommaripalli Village, Ramanaidupalli Post,G.D.Nellore Mandal,Chittoor District.
Now R/at No.241, 2nd Floor, Sri Balaji Nivas, 11th Main Road, AGS Layout, Bangalore - 560 061. Karnataka State.

Madam/Sir, Please take notice that the above named plaintiff filed the above suit as against both of you and another for recovery of suit amount basing on the suit promissory note executed by T.Hemadri Naidu in favour of the plaintiff and the above suit is posted to **05-08-2025** for your appearance before the said court. Please be present on the said date at about 10.30 a.m. either in person or through an advocate and to raise objections if any, failing which, the matter will be decided in your absence as exparte.

Sd/-**C.SUBRAMANYAM**
Counsel for Plaintiff
Place: Chittoor Date : 12-07-2025

IN THE COURT OF THE SPECIAL COURT FOR EXCISE CUM ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION): CHITTOOR.
I.A. No. 65 of 2023
O.S. No: 384 OF 2023

Between:
Smt., Pushpamma and another .....Petitioners/Plaintiffs
And:
L. Kodanda Naidu and others ...Respondents/Defendants

NOTICE TO THE RESPONDENT No. 3

To:
SMT., NIRMALA,W/o Sudhakar Naidu, aged about 40 Years, Hindu, residing at Santhi Nagar, Palamaner Town, Chittoor District..

Madam,
The above I**nterlocutory Application No.65 of 2023 in Suit O.S. NO. 384 OF 2023** filed by the Petitioners/Plaintiffs against you is Stands Posted to **26-08-2025** for your appearance before the Learned Special Court for Excise Cum Additional Civil Judge (Junior Division), Chittoor by 1**0:30 AM**.Hence, you are hereby informed to appear either in person or through your Advocate by **10:30 A.M. on 26-08-2025** failing which, the matter will be decided on your absence.

Sd/-**T.PURUSHOTHAM**
Advocate for Petitioner/Plaintiff

సుపరి పాలనకు తొలిఅడుగు



ప్రచారం నిర్వహిస్తున్న మంత్రులు

ప్రజాశక్తి - జిడి నెల్లూరు: సుపరిపాలనకు ఇది తొలి అడుగు అని మంత్రులు గొట్టిపాటి సురేష్ కుమార్, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. జీడీ నెల్లూరు నియోజకవర్గంలో నెల్లేపల్లేలో 'సుపరిపాలనలో తొలి అడుగు, ఇంటింటికీ టిడిపి'ని శనివారం ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. నెల్లేపల్లి గ్రామంలో 25 లక్షల ఎంపీ నిధులతో ఏర్పాటు చేసిన సిసి రోడ్లను మంత్రులు గొట్టిపాటి సురేష్ కుమార్, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులను కూటమి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. స్థానిక సమస్యలు మంత్రులతో పాటు ఎంపీ దగ్గుమళ్ళ, ఎమ్మెల్యేలు డాక్టర్ థామస్, గురజాల జగన్ మోహన్ అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ థామస్. భవిష్యత్తులో గంగాధర నెల్లూరు రూపురేఖలను మార్చేందుకు కూటమి ప్రభుత్వం చిత శుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ ఆనంద రెడ్డి, ఎంపీడీవో కృష్ణ మహేష్ రెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణమ నాయుడు, జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, మాజీ జెడ్పిటిసి చిట్టిబాబు నాయుడు, మండలం టిడిపి అధ్యక్షుడు స్వామి దాస్, హరీష్ యాదవ్, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవ సుందరం, మాజీ సర్పంచ్ పుష్ప రాజ్, టిడిపి నాయకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: జిడి నెల్లూరు మండలం నెల్లేపల్లిలో 'సుపరిపాలనకు తొలి అడుగు' కార్యక్రమం ప్రభుత్వ

సిసి రోడ్ల ప్రారంభోత్సవంలో మంత్రులు

విప్ ఎమ్మెల్యే డాక్టరు విఎం థామస్ సమక్షంలో తెలుగు తమ్ముళ్లు ప్రారంభించారు. శనివారం ఈ కార్యక్రమానికి రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రాంప్రసాద్ రెడ్డి హాజరయ్యారు. ఆయనను వెదురుకుప్పం క్లస్టర్ ఇన్‌ఛార్జి , మాజీ మండల పార్టీ అధ్యక్షులు మోహన్ మురళి శాలువా కప్పి సన్మానిం చారు. మండల పరిస్థితిని వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయ కులు పాల్గొన్నారు.

రొంపిచర్ల: 'సుపరిపాలనలో తొలి అడుగు'లో భాగంగా రొంపిచర్ల మండలం చంచం రెడ్డిగారి పల్లి పంచాయతీలో శ్రీ రాముల వడ్డీపల్లి ప్రతి ఇంటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలు గురించి వివరించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, బూత్ ఇన్‌ఛార్జి దేవలపల్లి చంగల్ రెడ్డి, రఘు, కో ఇన్‌చార్జి అశ్విన్, మనోజ్, పవన్, సత్యం, కార్యకర్తలు పాల్గొన్నారు.

శాంతిపురం: రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం శ్రద్ధతో కృషి చేస్తూ ఉందని మాజీ శాసనమండలి సభ్యులు, మాజీ టీటీడీ బోర్డు మెంబర్, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గౌని వారి శ్రీనివాసులు అన్నారు. కుప్పం నియోజకవర్గం, శాంతిపురం మండల పరిధిలోని అబకల దొడ్డి కాలనీలో శనివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తికావస్తున్న సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు, సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని శాంతిపురం మండలంలో మండలంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు ఏడాది సుపరిపాలనలో చేపట్టిన అభివృద్ధి గురించి వివరించారు. కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబు చేస్తున్న అభివృద్ధిని చూసి జీవితాంతం ఆయనను గుర్తు పెట్టుకుం టామని మహిళలు, గ్రామస్తులు పేర్కొన్నారు. ప్రజల స్పందనపై నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

IN THE COURT OF 2ND ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION) OF CHITTOOR
I.A.No.1115 of 2022
O.S.No.1125 of 2022

Between:
M.Chandra Sekharam ...Petitioner/Plaintiff
And:
1) G.K.Suma, 2) T.H.Thaneesh,
3) T.Sakkubhayamma. ...Respondents/Defendants

NOTICE TO THE RESPONDENTS No.1 & 2

R-1) G.K.Suma, W/o late T.Hemadri Naidu,
R-2)T.H.Thaneesh, S/o late T.Hemadri Naidu.
Native of Bommaripalli Village, Ramanaidupalli Post,G.D.Nellore Mandal,Chittoor District.
Now R/at No.241, 2nd Floor, Sri Balaji Nivas, 11th Main Road, AGS Layout, Bangalore - 560 061. Karnataka State.

Madam/Sir, Please take notice that the above named petitioner / plaintiff filed the above petition as against both of you and another for attachment of immovable property before judgment towards security for suit amount basing on the suit promissory note executed by T.Hemadri Naidu in favour of the petitioner/ plaintiff and the above petition is posted to **05-08-2025** for your appearance before the said court. Please be present on the said date at about **10.30 a.m**. either in person or through an advocate and to raise objections if any, failing which, the matter will be decided in your absence as exparte.

Sd/-**C.SUBRAMANYAM**
Counsel for Petitioner/Plaintiff
Place: Chittoor Date : 12-07-2025

IN THE COURT OF THE SPECIAL COURT FOR EXCISE CUM ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION): CHITTOOR.
O.S. No: 384 OF 2023

Between:
Smt., Pushpamma and another .....Plaintiffs
And:
L. Kodanda Naidu and others ...Defendants

NOTICE TO THE DEFENDANT No. 3

To:
SMT., NIRMALA,W/o Sudhakar Naidu, aged about 40 Years, Hindu, residing at Santhi Nagar, Palamaner Town, Chittoor District..

Madam,
The above Suit **O.S. NO. 384 OF 2023** filed by the Plaintiffs against you is Stands Posted to **26-08-2025** for your appearance before the Learned Special Court for Excise Cum Additional Civil Judge (Junior Division), Chittoor by **10:30 AM**. Hence, you are hereby informed to appear either in person or through your Advocate by **10:30 A.M. on 26-08-2025** failing which, the matter will be decided on your absence.

Sd/-**T.PURUSHOTHAM**
Advocate for Plaintiff